# బాకీ

"బంగారు బాల్యం"

"నా బాల్యం నాకివ్వవూ"

"బాల్యం అంటే హాయి, వెన్నెల రేయి"

"ఏ చీకూ చింతా లేనిది బాల్యం ఒక్కటే"

-కొందరు అలా అన్నప్పుడూ, కథల్లోనూ కవితల్లోనూ చదివినప్పుడూ తనలో తను నవ్వుకునేవాడు సంజీవరావు. వాళ్ళ జీవితాలు వడ్డించిన విస్తర్లు అనుకునేవాడు.

పెద్దలు ఆర్జించిన పొలం పుట్రా వున్న వాళ్ళ పిల్లలకు బాల్యం బంగారమే.

మంచి మంచి ఉద్యోగాలు చేసే వాళ్ళ పిల్లల బాల్యం ఏ చీకూ చింతా లేనిదే.

కానీ, తనలాంటి ఎందరికో బాల్యం ఓ శాపం. కష్టాల కారడవి. అరిష్టాల పెనుకడలి.

ఓ కవి మిత్రుడన్నట్లు -

పగళ్ళ నెగళ్ళలో రగిలింది బాల్యం.

రాత్రుల కౌగిళ్ళలో నలిగింది బాల్యం.

అందుకే తను సాధ్యమయినంతవరకూ బాల్యాన్ని ఓ పీడకలగా మరిచిపోవడానికి ప్రయత్నిస్తుంటాడు.

అయినా ఏదో ఓ సందర్భంలో అది గుర్తుకు రాక తప్పదు. ఆలోచనలు సొంత వూరికి పోక మానవు.

పుట్టి పెరిగిన వూరి మీద కొందరిలా తనకు మమకారం లేదు. అలాగని కోపమూ లేదు.

ఆ మాష్టారే తన వూరికి వచ్చి వుండకపోతే తన వూరంటే తనకు కోపం కూడా వుండేదేమో.

ఇప్పుడంటే మాష్టారు అని తనంటున్నాడు.

చిన్నప్పుడు ఆయన తమ వూరిలోని వారందరికీ మాల మాష్టారే.

తమ వూరు పచ్చపచ్చని పొలాలతో కన్నుల కింపుగా వుండేది. చెట్లూ పుట్టలూ డొంకలూ వూర్లోనూ, వూరి చుట్టూను వుండేవి.

కాకినాడ వెళ్ళాలంటే పడవ మీదో, నడిచో ఏడు మైళ్ళు ప్రయాణించాల్సిందే. మొన్న మొన్నటిదాకా బస్ సౌకర్యం కూడా లేదు. ఇప్పటికీ వూరి వరకూ బస్ రానేరాదు. పెదపూడిలో దిగి ఓ మైలు నడవాల్సిందే.

ఓ తాటాకు పాకలో తమ ప్రైమరీ స్కూలు. మాస్టర్లనూ కులాల పేర్లతోనే పిలవడం.

"మాల మాస్టారండీ"

"కాపు మాష్టారేరీ"

"ఆచారి మాష్టార్ని పిలు"

మిగతా మాస్టార్ల సంగతేమోకాని మాల మాస్టారు బాధపడేవారు. ఆ సంగతి తనకు మొదట్లో తెలియదు. మాస్టారికి దగ్గరయ్యాక తెలిసింది. మూడో తరగతిలో వుండగా నాన్న తనను బడి మానెయ్యమన్నాడు. తనేమో చదువుకుంటానన్నాడు. చదివింది చాలు, ఇంక బడికెళ్ళొద్దు, పనిలో పెడతానన్నాడు.

"నాన్నకు నువ్వయినా చెప్పమ్మా" అంటూ తను బతిమిలాడాడు.

అమ్మ చెప్పినా నాన్న వినలేదు. అప్పుడు మాస్టారే కలగచేసుకున్నారు.

అమ్మా నాన్నలిద్దర్నీ దగ్గర కూర్చోబెట్టుకుని ఎంతసేపో చెప్పారు. ఆయనంతసేపు ఏం చెప్పారో తనకప్పుడు పూర్తిగా అర్థం కాలేదు. అయితే చదువుకుంటే ఎంత మంచిదో బోధపరిచారని మాత్రం తనకు తెలిసింది.

"మీకేం మాస్టరుగోరు, ఎన్నయినా సెబుతారు. మూడు పూటలా తిండెట్టడానికే కస్టమయిపోతున్నాది. సదువంటే మాటలా, బుక్కులు కొనాలి. ఇక్కడయ్యేక పైవూరికి ఇస్కూలుకి పంపాల" అన్నాడు నాన్న తలగోక్కుంటూ.

"ముందీ చదువు అవనీ, పుస్తకాలు నేను కొంటాను. హైస్కూలు చదువు గురించి తర్వాత ఆలోచిద్దాం" అంటూ మాస్టారు నచ్చచెప్పారు.

నసుగుతూనే నాన్న ఒప్పుకున్నాడు. ఆ తర్వాత ఇంట్లో నసపెడుతూనే వుండేవాడు.

"పనిలో ఎడితే సాలుకి ఏడెనిమిది బత్తాల వడ్లు వచ్చేవి. ఏణ్ణీళ్ళకి సన్నీళ్ళలా ఎసులు బాటుండేది" అంటూ నాన్న అమ్మ దగ్గర అంటుండేవాడు.

"సాల్లేవయ్యా రోజూ ఒకటే పాట. పెద్దోడు ఎట్టాగూ పాలికాపుగా పని సేస్తున్నాడు

గందా. సిన్నోడినయినా సదూకోనీ. మాస్టరు గోరు అంతలా సెప్పేరుగందా. ఆయనే సూత్తారులే ఆడి కట్టసుకాలు" అనేది అమ్మ.

అమ్మ అన్నట్టే తన చదువు కోసం మాస్టారు చాలా సాయం చేశారు. ఆయన కొడుకుతో సమానంగా తనను చూశారు. తనొక్కడినేనా? తన చిన్నాన్న కొడుక్కీ, మావయ్య కొడుక్కీ కూడా ఎంతో సహాయపడ్డారు. తమ తర్వాత మరికొందరిని చదువుకునేలా చేశారు.

"నీ అజ్ఞానం పోవాలన్నా, ఇతరుల అజ్ఞానం నీకు తెలియాలన్నా జ్ఞానం అవసరం" అనేవారు మాస్టారు తరచూ.

మాస్టారి మాట విన్నవాళ్ళు తక్కువే. మగపిల్లలు పుడితే ఏడెనిమిదేళ్ళ నుంచీ సంపాదన పరులవుతారనీ, వాళ్ళ తిండి వాళ్ళే సంపాదించుకుంటారనీ నమ్మేవాళ్ళే ఎక్కువ.

నాలుగో తరగతిలోనూ, అయిదో తరగతిలోనూ మాస్టారే పుస్తకాలు కొన్నారు. క్లాసు పుస్తకాలతోపాటు ఇతర పుస్తకాలూ చదివించేవారు.

క్రిస్టియన్ మిషనరీ వాళ్ళెవరో వస్తే తమ పేటలో పెట్రోమాక్సు లైట్లు పెట్టించి సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో వాళ్ళు క్రీస్తుపాటలు పాడారు. మాట్లాడారు.

తమ పేటలోని కొందరు ఆ మర్నాడే క్రిస్టియన్ మతం పుచ్చుకున్నారు. మరి కొందరు వెనకాడుతుంటే మాస్టారు వాళ్ళను ప్రోత్సహించారు.

"హిందూ మతం మనల్ని అంటరానిదిగా చేసింది. ఆ మతాన్ని పట్టుకుని వేళ్ళాడడంవల్ల ఒరిగేదేమీలేదు. క్రిస్టియన్ మతం తీసుకోండి" అంటూ ఆయన ఎన్నో విషయాలు చెప్పారు.

ఈ విషయంలో మాత్రం ఆయన మాట చాలామంది విన్నారు.

"కిరస్తానీ మతం తీసుకుని మాలోళ్ళందరూ చెడిపోతున్నారు. అంతా కలికాలం" అంటూ అగ్రకులాల పెద్దలు గుండెలు బాదుకున్నారు.

ఇప్పుడు తలచుకుంటే వాళ్ళ మాటలకు నవ్వొస్తోంది.

మాలవాళ్ళు చెడిపోవడమేమిటి? బహుశా బాగుపడిపోతారని వాళ్ళప్పుడే వూహించా రేమో!

తమ పేటలోని చాలామంది పిల్లలు పనిలోకెళ్ళేవారు. ఎక్కువగా పశువుల కాపర్లుగా పనిచేసేవారు... బాల జీసస్‌లు!

తనలా కొందరు మాత్రమే స్కూలుకొచ్చేవారు!

అయినా, తమకూ వాళ్లకూ బంగారు బాల్యం లేదు. మంచి బట్టలేదు. మంచి తిండి లేదు. ఆటపాటల్లేవు. ఉన్నవల్లా రోగాలూ రొస్టులూ.

తమ బాల్యంలో వున్నది ఒకే ఒక సుఖం. అది నిద్ర సుఖం. ఆ సుఖం కూడా సంవత్సరం పొడుగునా వుండేదికాదు. వానాకాలంలో వర్షంవల్లా, శీతాకాలంలో చలివల్లా నిద్రపట్టేదికాదు. పట్టినా కాసేపటికి మెలకువ వచ్చేసేది. ఎండాకాలంలో గుడిసెల ముందున్న ఇరుకు మట్టి రోడ్డు మీద సాయంత్రం అయ్యేటప్పటికి నీళ్ళు జల్లి, నేలబాగా చల్లారాక ఏ రాత్రికో పడక.

వరదలొచ్చినా, అగ్ని ప్రమాదాలు జరిగినా ముందుగానూ కోలుకోలేనంతగానూ నష్టపోయేది తమ పేటే.

ఎండాకాలంలో ఒకనాటి అర్థరాత్రి తనకింకా గుర్తే. పెద్దోళ్లంతా కంగారు కంగారుగా లేచి పరుగెడుతుంటే తనకు మెలకువ వచ్చింది.

దూరంగా ఓ గుడెసె అంటుకుంది. ఆర్పడానికి బిందెలతోనూ, కుండలతోనూ నీళ్ళు పట్టుకెళ్ళారు. ఓ పక్క నీళ్ళు పోస్తుంటే మరోపక్క ఒకో గుడిసెకూ మంటలు పాకి పేటపేటంతా కాలిపోయింది.

అప్పుడా పేట అవమానాలతో వాడిపోయిన ముఖంలా వుంది. ఆకలి మంటలతో నకనకలాడిన కడుపులా వుంది. కసితీరని కన్నులా వుంది. దౌర్జన్యాలకు వంగిన వెన్నులా వుంది. అవునది వేదభూమికాదు, వేదన భూమి.

మళ్ళీ గుడిసెలు వేసుకోవడానికి ఎంతకాలం పట్టిందో, ఎన్ని అప్పులయ్యాయో..... ఎన్ని ఇబ్బందులు పడ్డారో!

కొన్ని రోజులపాటు ప్రెసిడెంటుగారి పశువుల శాలలో, మునసబుగారి కచేరి సావిడిలో తాము తలదాచుకున్నారు.

ఓట్ల పండుగలే లేకపోతే ఆ సాయం కూడా దొరికేది కాదు. ఓట్ల జాతరలేకదా తగిలిన గాయాలను మాన్పుకోకుండా చేశాయి. జవసత్వాలు జావకారుస్తూ వున్నాయి.

తమ పంచాయతీ ఎస్.సి.కి రిజర్వ్ అయ్యేక కూడా తమ బతుకుల్లో మార్పులేదు. ప్రెసిడెంటు తమవాడే అయినా, అతను పేరుకే. తతంగమంతా నడిపేది పాతకాపే!

జగన్నాథరాజుగారి పొలంలో నాన్న పెదపాలేరు. అన్న చినపాలేరు. తనూ వాళ్ళింటికి అప్పుడప్పుడూ వెళ్ళేవాడు. అదీ అమ్మో నాన్నో వెళ్ళమన్నప్పుడు.

పోలేరమ్మ సంబరం రోజున ఓ అత్తలం అరటిపళ్ళు తన చేతికిచ్చి "అయ్యగారి కిచ్చిరా" అంది అమ్మ.

అమ్మ పొద్దుటే బూరెలు వండడం తను చూశాడు.

రాజు గారింట్లో బూరెలు వండినప్పుడు వాళ్ళిస్తే అమ్మ ఇంటికి తెస్తుండేది. అది జ్ఞాపకానికొచ్చి అమ్మ ఏదో పనిలో హడావుడిగా వుంటే, అరటిపళ్ళు పెట్టిన సంచిలో పదో, పన్నెండో బూరెలు వేసి రాజుగారింటికి తీసుకెళ్ళాడు.

అరటిపళ్ళ అత్తలం తీసి ఇంటి సోఫా అరుగుమీద పెట్టాడు. బూరెలు కూడా తీశాడు.

"వద్దొద్దు" అంటూ అమ్మగారు కంగారు పడ్డారు.

చేత్తో బూరెలు పట్టుకుని తను ఆశ్చర్యంగా చూశాడు.

"ఏరా, ఆ బూరెలు కూడా మాకిమ్మని మీ అమ్మే యిచ్చిందా"

"నేదండి, నేనే తెచ్చాను"

"అదీ, అలా చెప్పు. వాటిని పట్టుకుపో. ఇదిగో. ఈ అయిదు రూపాయిలూ మీ అమ్మకివ్వు" అంటూ ఆవిడ అరుగు మీద అయిదు రూపాయల కాగితం పెట్టింది.

తను ఇంటికి బయలుదేరాడు.

తనకంతా ఆశ్చర్యంగా వుంది. అరటిపళ్ళు తీసుకున్నవాళ్ళు బూరెలు ఎందుకు తీసుకోలేదు? అవీ ఇవీ తినేవే కదా.

అదేమాట అమ్మతో అన్నాడు. అమ్మ ముందు కోప్పడి, తర్వాత నవ్వేసింది. "ఇంకెప్పుడూ నాకు సెప్పకుండా అలా సెయ్యమాక, అరటి పళ్ళంటే సెట్టుకు కాసినాయి. బూరెలేమో నానొండేనుగందా. పెద్ద కులపోలు ముట్టుకోరు" అంది.

"అంటు"ల్లో ఇదీ ఒకటన్నమట అనుకున్నాడు తను.

రైల్వే గేటు వేసి వుండడంతో ఆలోచనల్తో పాటు స్కూటరు కూడా ఆపుచేశాడు సంజీవరావు.

గేటు పక్కనే వున్న చిన్న దారిలోంచి కొందరు సైకిళ్ళ మీదా, స్కూటర్ల మీదా కష్టపడి వెడుతున్నారు.

తను కూడా అలా వెళ్దామా అనుకున్నాడు. ఎందుకా రిస్కు? రాజూ, శాస్త్రీ వచ్చేటప్పటికి టైముండదేమో. దారిలో ఏ పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచయినా ఇంటికి ఫోన్ చేసి వుండాల్సింది.

వాళ్ళయినా ఈ రైలు గేటు దాటే రావాలి. పైగా ఏ రిక్షాలోనో, సిటీ బస్సులోనో వస్తారు. ఫర్వాలేదు. టైముంటుంది.

సంజీవరావు వాచీ చూసుకున్నాడు. సాయంత్రం అయిదున్నర.

అరగంట క్రితమే తమ వూరి జగన్నాధరాజు, గోపాలశాస్త్రి డీలక్స్ సెంటర్ దగ్గర కనిపించారు.

మార్వాడీ దగ్గర పని చూసుకుని ఇంటికొస్తామన్నారు.

సంజీవరావు గేటు దాటాడు.

"మీవోడు మాకు బూరెలు తెచ్చాడోయ్ మొన్న"

"ఏదో సిన్నతనం, తెలియకయ్యా"

"అందులో అభిమానం వుందిలే" అంటూ రాజుగారు నవ్వు.

నాన్నా చిన్నగా నవ్వాడు. తనకు ఒళ్ళు మండిపోయింది.

క్రిస్మస్ రోజున మాస్టారు ఓ నాటిక వేయించారు. తామంతా స్టేజి కట్టారు. పట్నం నుంచి మైకు, పెట్రోమాక్సు లైట్లు తెప్పించారు.

డబ్బుందనే గర్వంతో ఓ యువకుడు చదువుకోడు. జల్సాలు చేస్తూ తిరుగుతాడు. ఆస్తంతా హరాయించుకుపోతుంది. చివరికి అతను పందుల కాపరిగా మారతాడు. ఆకలికి తాళలేక పందులకు పెట్టే తవుడు తింటాడు. ఆ నాటిక అంత మటుకే తనకు గుర్తుంది.

మాస్టారి ప్రోత్సాహంతో తను రాత్రింబవళ్ళు చదివాడు. స్కాలర్‌షిప్పులతో హైస్కూలు చదువు పూర్తిచేశాడు. డిగ్రీ హాస్టల్‌లో వుండి చదివాడు. స్కాలర్‌షిప్పు డబ్బును ఎంతో పొదుపుగా వాడేవాడు. రెండు మూడు జతలతోనే గడిపేవాడు.

"అవకాశాలు అస్తమానం రావు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగిపోవద్దు. చదువు, దానివల్ల వచ్చే ఉద్యోగం - ఇవే మీకు సంఘంలో మంచి స్థాయిని కల్పిస్తాయి. ఆ స్థాయి వచ్చేక మీరు నిబ్బరంగా వుండొచ్చు. అంటరానితనాన్ని ఎదుర్కోవచ్చు" అంటూ మాస్టారు చిలక్కి చెప్పినట్లు చెప్పేవారు. ఎన్నో ఉదాహరణలు ఇచ్చేవారు.

తనూ, మరికొందరూ మాస్టారి మాటను జవదాటలేదు. ఎక్కువమంది పెడచెవిని పెట్టారు. స్కాలర్‌షిప్పును మరికొంతకాలం వుపయోగించుకోవడానికి చదువును పొడిగించుకున్నారు.

డిగ్రీకి వచ్చేక సెలవుల్లో ఇళ్ళకెళ్ళడానికి వెనకాడేవారు. మళ్ళీ ఆ గుడిసెల్లో వుండడానికి, తమను చిన్నచూపు చూసే పెద్ద కులాల వాళ్ళ ముందు తిరగడానికి మనస్కరించేది కాదు.

కొందరిలా పెడదారి పట్టకుండా వుండడానికి తను చాలా కష్టపడాల్సి వచ్చింది.

హాస్టల్ జీవితం వేరు. వూళ్ళో జీవితం వేరు. రెండింటి మధ్య ఎంతో వైరుధ్యం. అయినా తను ధైర్యంగా ఎదుర్కొన్నాడు.

సమస్యల నుంచి పారిపోవడంవల్ల ఆ సమస్యలు తీరవని మాస్టారు పదే పదే చెప్పిన మాటను తను మరువలేదు.

సంజీవరావు కొత్త ఇంటి ముందు స్కూటర్ స్టాండ్ వేసి, పిట్ట గోడకు వేలాడగట్టిన 'టులెట్' బోర్డు వంకోసారి చూసి చిన్నగా నవ్వుకుంటూ లోపలికెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

"టిఫిన్ తేనా"

"ఏం చేశావ్"

"ఉప్మా"

"అదలా వుంచు. మనింటికి మనూరి రాజూ, శాస్త్రీ కాసేపట్లో వస్తారు. అదే సర్ది ఇద్దరికీ పెడుదువుగాని"

"మీరిది తినండి. వాళ్ళకు మళ్ళీ చేస్తాను'

"ఎందుకు లెద్దూ శ్రమ. రవీ, రజనీ ట్యూషన్ కెళ్ళారా"

"ఆ మీరొచ్చే ముందే వెళ్ళారు" అంటూ లోపలికెళ్ళి కాఫీ పట్టుకొని వచ్చింది లత.

సంజీవరావు కాఫీ తాగుతూ టైమ్ చూశాడు.

"అన్నట్లు చెప్పడం మరిచాను. ఓ గంట క్రితమే ఇల్లు అద్దెకు కావాలంటూ ఒకాయన వచ్చాడు"

"టులెట్ బోర్డు బాగా చూసే వచ్చాడా?"

"ఆ ...మాదిగలట. అది కూడా నచ్చింది. అయిదొందలు అడ్వాన్స్ ఇచ్చి రేపొస్తానంటూ వెళ్ళాడు" అంది లత అతని పక్క కుర్చీలో కూర్చుంటూ.

"బావుంది. మనింట్లో నీ బలం పెరుగుతుందన్నమాట"

"నా బలం అంతా మీరే. ఇంకెవరి అండా నాకవసరం లేదు"

లత గొంతులో, కళ్ళల్లో భర్త మీద అపార విశ్వాసం, అభిమానం.

"సరదాకన్నానులే"

"నాకా సంగతి తెలుసులే" అంటూ నవ్వుతూ లత వంట గదిలోకెళ్ళిపోయింది.

సంజీవరావు కుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు.

తమ పెళ్ళి అప్పట్లో చుట్టపక్కాల్లో పెద్ద దుమారం లేపింది. ఊరికి చివర తనుండే మాలపేట. ఊరి మొదట్లో మాదిగ పేట.

ఊరు దాటి వెళ్ళాలంటే మాదిగ పేట ముందు నుంచే వెళ్ళాలి.

లత ప్రైమరీ స్కూల్లో తను చదివేటప్పుడే చదివింది. అయిదో తరగతి తర్వాత చదువు మానేసింది. ఆ చదువు కూడా మాస్టారివల్లే సాగింది.

తను హైస్కూలు కెళ్ళేటప్పుడో, వచ్చేటప్పుడో కనిపిస్తుండేది. పలకరింపులల్లా కబుర్ల వరకూ వచ్చింది. కొన్నాళ్ళకు ఒకళ్ళంటే ఒకళ్ళకు ఇష్టం ఏర్పడింది.

మాస్టారే మధ్యవర్తిగా వుండి తమ పెళ్ళి జరిపించారు. అందుకోసం ఆయన చాలా కష్టపడాల్సి వచ్చింది. రెండు వైపుల నుంచి మాటలు పడాల్సి వచ్చింది.

మాస్టారి మీద గౌరవంతో అమ్మా నాన్న తమ పెళ్ళికి ఒప్పుకున్నా చుట్టపక్కాల నుంచి చాలా వ్యతిరేకత వచ్చింది. తమ కుటుంబాల్ని కులం నుంచి వెలి వేస్తామన్నారు. చాలా గొడవ చేశారు.

మాదిగపేటలో లత కుటుంబాన్ని వెలివేశారు.

రక్త సంబంధీకులూ, కొద్దిమంది మిత్రులూ తప్ప తమ పెళ్ళికి బంధువర్గం రాలేదు.

పెళ్ళి అయిన వెంటనే మాస్టారు చిన్న సభలాంటిది పెట్టారు.

"అసలైన కులాంతర వివాహం ఇదే. ఏ యితర కులాల వాళ్ళను చేసుకున్నా ఇంత వ్యతిరేకత రాదు. మాల మాదిగలు అంటరానివాళ్ళుగా ఒకే రకమైన అవమానాలను ఎదుర్కొంటున్నారు. అయినా రెండు కులాల వాళ్ళూ ఒకళ్ళని ఒకళ్ళు అంటరాని వాళ్ళుగా చూసుకుంటున్నారు. ఒకరింట్లోని పచ్చి మంచినీళ్ళు కూడా మరొకళ్ళు తాగని పరిస్థితి. ఈ వివాహంతో నయినా రెండు కులాల వాళ్ళూ ముందు ముందు దగ్గరవుతారని ఆశిస్తున్నాను." అంటూ ఆయన చాలా ఉద్రేకంగా మాట్లాడారు.

మాస్టారి ఆనాటి ఆశ నేటికీ పూర్తిగా నెరవేరలేదు. తమ ఊరిలోనే కాదు, దాదాపు

ప్రతి వూరిలోని పరిస్థితీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్టుగా వుంది.

పెళ్ళయ్యాక లత పట్టుదలతో చదివి మెట్రిక్ పాసయింది.

"ఏంటాలోచిస్తున్నారు" అంటూ లత వచ్చి అతని పక్క కుర్చీలో కూర్చుంది. సంజీవరావు ఉలిక్కిపడి కళ్ళు తెరచి భార్య వంక చూశాడు.

"రాజూ, శాస్త్రీ ఇంక రావచ్చు" అంటూ లతకు ఏదో చెప్పాడు.

"మనం ఎప్పుడూ అలా చెయ్యలేదు కదా. ఇప్పుడు మాత్రం ఎందుకు"

"ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు మొదలు పెట్టాలి కదా. వాళ్ళకింకా అహం వదల్లేదు. మొన్నా మధ్య ఆఫీసుకొచ్చినప్పుడు ఏవో మాటల్లో తమ కులం గొప్పలు చెప్పుకొచ్చారు" అంటూ బాత్‌రూమ్‌కి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చాడు.

గేటు దగ్గర అలికిడి అవడంతో సంజీవరావు కుర్చీలోంచి లేచి వరండాలో కెళ్ళాడు.

జగన్నాథరాజు, గోపాలశాస్త్రి టులెట్ బోర్డును చూస్తూ ఏదో అనుకుంటున్నారు.

"రండి" అన్నాడు సంజీవరావు.

ఇద్దరూ గేటు తీసుకుని వరండా మీద కొచ్చారు. సంజీవరావు విజిటర్స్ రూమ్‌లోకి వెళ్ళబోతుంటే వాళ్ళూ అతని వెంట వెళ్ళబోయారు.

"ఇక్కడే వుండండి" వాళ్ళతో అని, విజిటర్స్ రూము నుంచి రెండు గోద్రెజ్ ఇనుప కుర్చీలు తెచ్చి వరండాలో వేశాడు. వాటి ముందు టీపాయ్ పెట్టాడు. పల్చని దిండు వున్న కేన్ చైర్ టీపాయ్‌కు ఇటువైపు వేసి, తను కూర్చుంటూ వాళ్ళనూ కూర్చోమన్నాడు.

"ఆఫీసులో అయితే బిజీ కదాని...."

"ఇంటికి వచ్చాం"

"మీరు" అనకుండా వాళ్ళు పడుతున్న అవస్థను చూసి వచ్చే నవ్వు ఆపుకున్నాడు సంజీవరావు.

తను మాత్రం తక్కువా?!

"అస్తమానం రానక్కర్లేదు. నాలుగయిదు రోజుల్లో పని అయిపోతుంది."

"ఒకూరివాళ్ళం అయింతర్వాత ఆ మాత్రం అభిమానాలుండకుండా వుంటాయా"

"అవును మరి"

వాళ్ళిద్దరి వంకా ఓసారి చూసి తలూపాడు సంజీవరావు.

కాసేపు తమ వూరి కబుర్లు చెప్పుకున్నారు.

"ఇందాక 'టులెట్' బోర్డు చూసినట్టున్నారు. ఎలా వుంది" కావాలనే అడిగాడు సంజీవరావు.

"హి హి హి" అంటూ నవ్వాడు శాస్త్రి.

విననట్టుగా వుండిపోయాడు రాజు.

అయితే వాళ్ళిద్దరి కళ్ళ ముందు టులెట్ బోర్డు మీది అక్షరాలు పెద్ద పెద్దవవుతూ కదిలాయి.

"ఈ ఇల్లు అగ్రవర్ణాలకు అద్దెకు ఇవ్వబడదు"

వాళ్ళు పడుతున్న ఇబ్బందిని గమనిస్తూ?

"మేం మా విజిటర్స్ రూములోకి అగ్రవర్ణాల వాళ్ళను రానివ్వం. బయటే కూర్చోబెడతాం. అందుకే మీకు కుర్చీలు వరండాలో వేయాల్సి వచ్చింది" అన్నాడు సంజీవరావు.

వాళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

అంతలో లత ఉప్మా ప్లేటు, మంచినీళ్ల గ్లాసులు టీపాయ్ మీద పెట్టి, "బావున్నారా" అంటూ పలకరించింది.

"ఆ ఆ" అన్నారిద్దరూ ఒకేసారి కంగారుగా; తెల్లగా శుభ్రమైన బట్టలతో మెరిసిపోతున్న లతను చూస్తూ.

"వచ్చేటప్పుడు టిఫిన్ చేసేవచ్చాం" అన్నాడు శాస్త్రి.

"అవును" అన్నట్లు తలూపాడు రాజు.

"టిఫినేకేం వుంది తీసుకోండి"

"అబ్బెబ్బే గొంతువరకూ వుంది."

"లతా, ఖాళీ ప్లేటు తీసుకురా" అన్నాడు సంజీవరావు.

ఖాళీ ప్లేటు తెచ్చి రెండు ప్లేట్ల నుంచీ కొంచెం ఉప్మా తీసి అందులో పెట్టి లోపలి కెళ్ళిపోయింది లత.

తను తింటూ, "నేను మీరొచ్చే ముందే తిన్నాను" అని అబద్ధమాడాడు.

"ఇంక తప్పదు" అనుకుంటూ ఇద్దరూ ఉప్మా తిన్నారు. టీ తాగారు.

"ఇవి పిల్లలకని తెచ్చాం" అంటూ యాపిల్ పళ్ళూ స్వీట్లు తమ సంచుల్లోంచి తీసి టీపాయ్ మీద పెట్టారు.

"ఈ పళ్ళుంచండి. స్వీట్లు పట్టుకుపోయి మీ పిల్లలకివ్వండి"

"ఇంటి దగ్గర నుంచే తెచ్చాం. సున్నుండలు"

"వద్దు, మేం వాటిని ముట్టుకోకూడదు" అన్నాడు సంజీవరావు నిర్మోహమాటంగా.

మరోసారి ఆశ్చర్యపోతూ, సున్నుండల పేకెట్లు తమ సంచుల్లో వుంచి "వెళ్ళొస్తాం. మా పని గురించి మరచిపోవద్దు" అంటూ వాళ్ళు లేచారు.

వాళ్ళ వాడిపోయిన ముఖాల వంక చూస్తూ.

"అలాగే" అంటూ తనూ లేచి నిలబడ్డాడు.

లత స్టీలు గ్లాసు పట్టుకుని గబగబా వచ్చి ఖాళీ ప్లేట్లమీదా, గ్లాసుల మీదా, ఖాళీ టీ కప్పుల మీద, ఇనుప కుర్చీల మీదా పసుపునీళ్ళు జల్లింది.

వాళ్ళు ఆమె చేస్తున్న పనిని తేరిపార చూసి, వరండా దిగారు. సంజీవరావు గేటుదాకా వెళ్ళి.

"వస్తుండండి" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

అతని నవ్వు చూస్తూ ఇద్దరూ ఉలిక్కిపడి రోడ్డు మీద కెళ్ళారు.

ఆ నవ్వు ఎక్కడో చూసినట్టుంది ఇద్దరికీ.

ఎక్కడ?

ఆలోచిస్తూ రాజూ, శాస్త్రీ నడుస్తున్నారు.

ఇందాక మార్వాడీ షాపులో కొంతకాలం క్రితం తాకట్టు పెట్టిన బంగారు వస్తువులకు సంబంధించి అసలు, వడ్డీ తాము చెల్లించినప్పుడు, డబ్బు లెక్క పెట్టుకుని సరిపోయిందన్నట్లు తలూపి,

"వస్తుండండి" అన్నాడు మార్వాడీ నవ్వుతూ.

అవును ఇది అదే నవ్వు.

(ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక 1995)